సాక్షి జగిత్యాల

గురువారం • 6 • ఏప్రిల్ • 2023



ఘనంగా పల్లకీసేవ

మల్లాపూర్ : హనుమాన్ దీక్షాస్వాముల ఆధ్వ ర్యంలో బుధవారం పట్టణంలో స్వామివారి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు.



రామనామ సంకీర్తన

జగిత్యాలటౌన్: హనుమాన్ జయంతిని పుర స్కరించుకుని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో రామనామ సంకీర్తన చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0/24.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుం ది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.



మొక్కు చెల్లించుకుంటున్న భక్తుడు



కొండపైకి చేరుకుంటున్న భక్తులు



క్యూలైన్లలో భక్తుల రద్దీ



ముడుపులు చెల్లిస్తున్న భక్తులు



కోనేటిలో స్నానాలు, పూజలు



అర్ధరాత్రి తర్వాత కొండపైకి వస్తున్న భక్తులు

శ్రీఆంజనేయం

- కాషాయమయమైన కొండగట్టు
- దీక్ష, మాల విరమణ చేసిన భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధి కాషాయమయమైంది. లక్షలాదిగా తరలివచ్చిన దీక్షాస్వాములు, మాలధారులు, సాధారణ భక్తులతో పుణ్యక్షేత్రం రద్దీగా మారింది. 'జై శ్రీరామ్.. జై హనుమాన్' అంటూ భక్తుల నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. బుధవారం ఉదయం ఐదు గంటల నుంచే మనరాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడం ప్రారంభమైంది. వీరంతా బుధవారం అర్ధరాత్రి 12గంటల తర్వాత క్యూలైన్ల ద్వారా శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత కల్యాణ కట్టకు చేరుకుని మాల విరమ ణ, దీక్ష విరమణ చేశారు. గురువారం హనుమాన్ చిన్నజయంతి నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. పోలీసుల డేగకళ్లతో పహారా కాస్తున్నారు.



తలనీలాలు సమర్పిస్తున్న స్వాములు



కొండపై భక్తజనం



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

రంజాన్ వేళలు

ఇతరులతో నిన్ను నువ్వు పోల్చుకోవ టం ఆపినప్పుడు నీవు నీ అసలైన జీవితపు ఆనందాన్ని పొందుతావు.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
గురు 6.36	శుక్ర 4.40

న్యూస్‌రీల్

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాలటౌన్/జగిత్యాలక్రైం: బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని బుధవారం స్థానిక మంచినీళ్ల బావి వద్ద ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసం త, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, ఎస్పీ భాస్కర్ తదితరులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అల ర్పించారు. దేశానికి చేసిన సేవలను కొనియా డారు. ఆదర్శ వివాహాలు చేసుకున్న వారికి ప్రో త్సాహకాలు అందజేశారు. కార్మిక శాఖ మంత్రి గా కనీస వేతనాల చట్టం అమలులోకి తెచ్చిన ఘనత జగ్జీవన్‌రామ్‌కే దక్కుతుందన్నారు.

ఎస్సెస్సీ.. టీఎస్‌పీఎస్సీ..

లీకు మూలాలు ఇక్కడే!

- ఉమ్మడి జిల్లాకు పేపర్ల లీకుల లింకులు
- పదో తరగతి పేపర్ కేసులో ఏ–1గా బండి సంజయ్‌కుమార్
- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటలకూ చేరిన పోస్టు
- ఆ ఘటనలోనే బండిపై సుమోటో కేసు, ప్రివెంటివ్ అరెస్టు
- అరెస్టు సమయంలో మరోసారి కరీంనగర్‌లో హైడ్రామా
- మల్యాలలో టీఎస్‌పీఎస్సీ లీకేజీపై సిట్ విచారణ



మంగళవారం రాత్రి కరీంనగర్‌లో బండి సంజయ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ అరెస్టు అనంతరం రాష్ట్ర రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మంగళవారం పదో తరగతి హిందీ పరీక్ష పత్రం సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో పోలీసులు అత్యంత గోప్యంగా, పకడ్బందీగా వ్యవహరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంగళవారం రెండు పరిణామాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఉదయం ఎస్సెస్సీ పేపర్ బూర ప్రశాంత్ అనే యువ కుడి కారణంగా కమలాపూర్ నుంచి బయటికి రావ డంతో పరిణామాలు అకస్మాత్తుగా మారిపోయి, రాత్రి వరకు బండి సంజయ్ అరెస్టుకు దారి తీసింది. మరోవైపు ఇటీవల టీఎస్ పీఎస్సీ లీకేజీలో ఏ–2 నిందితుడిగా ఉన్న అట్ల రాజశేఖర్‌రెడ్డి జగిత్యాల జిల్లా మల్యాలకు చెందిన అతను కావడంతో సిట్ దర్యాప్తులో భాగంగా దర్యాప్తు ముమ్మరం చేసింది. దీంతో రాష్ట్రాన్ని తీవ్రంగా కుదిపేసిన రెండు అంశా లకు మూలం ఉమ్మడి కరీంనగర్ జిల్లానే కావడం చర్చనీయాంశంగా మారింది.

సంజయ్, ఈటలకు లింకులు ?

మంగళవారం ఉదయం ఎస్సెస్సీ పేపర్ సోషల్ మీడియాలో బయటికి రావడం కలకలం రేపింది. ఈ విషయంలో పోలీసులు పేపర్ ఎక్కడి నుంచి వచ్చింది? అన్న విషయాన్ని గుర్తించినా.. దానికి బం డి సంజయ్‌కు ఉన్న లింకులను బుధవారం వెల్లడిం చింది. పేపర్‌ను బూర ప్రశాంత్ తొలుత ఎంపీ బం డి సంజయ్‌కు పంపడం, పలుమార్లు ఫోన్లు మాట్లా డటంతో అతడినే ఈ కేసులో కుట్రదారుడిగా.. ఏ–1గా వరంగల్ పోలీసులు చేర్చారు. అదే సమ యంలో సదరు ఎస్సెస్సీ హిందీ పేపర్ హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఫోన్‌కు కూడా చేరిందని పోలీసులు తెలిపారు. కానీ.. ఈ ఆరోపణలను రాజేందర్ మీడియాకు స్పష్టమైన వివ రణ ఇవ్వలేకపోయారు. ఇదే కమలాపూర్ పోలీసులు బండి సంజయ్ మీద నమోదు చేసిన కేసు ఆధారం గా కరీంనగర్ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి అరెస్టుకు పూనుకున్నారు. బుధవారం మధ్యాహ్నానికి బండి సంజయ్‌పై టూటౌన్‌లో సుమోటో కేసు నమోదు చేసి, ముందస్తు అరెస్టుకు దారి తీసిన పరిస్థితులను ఎఫ్ఐఆర్‌లో వివరించారు.

మల్యాలలో సిట్.. దూకుడు..!

మరోవైపు టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 పేపర్ లీకేజీలో ఏ–2గా ఉన్న రాజశేఖర్‌రెడ్డిది జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపెల్లి. 2017 వరకు విదేశా ల్లో ఉన్న రాజశేఖర్‌రెడ్డి తరువాత ఏడాది తనకున్న పరిచయాలతో టీఎస్‌పీఎస్సీలో కొలువు సాధిం చాడు. అనంతరం పలు పేపర్లను పరీక్షకు ముందే విక్రయించాడన్న కేసులో అరెస్టయ్యాడు. ఇతను కూడా ఉమ్మడి జిల్లా వాసే కావడం గమనార్హం. మం డలంలో మొత్తం 40 మంది గ్రూప్–1 పరీక్ష రాసిన వారి వివరాల ఆధారంగా సిట్ నేరుగా మంగళ వారం నుంచి రంగంలోకి దిగింది. మొత్తం 40 మం దిలో దాదాపు 35 మందికిపైగా 100 లోపు మార్కు లు రాగా, కేవలం ఐదుగురికి మాత్రం 100 మార్కు లు దాటాయని సమాచారం. వీరందరినీ సిట్ బృం దం రెండురోజులుగా నేరుగా వారి ఇంటికే వెళ్లి విచారిస్తోంది.

మరోసారి కరీంనగర్‌లో ఉద్రిక్తత!

ఎస్సెస్సీ హిందీ పేపర్ సోషల్‌మీడియాలో ప్రత్యక్షం కావడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగ ణించింది. సాయంత్రానికి కుట్రలో ఎవరెవరు పాలు పంచుకున్నారన్న విషయంపై పోలీసుశాఖ పలు ఆధారాలు సంపాదించింది. అందులో భాగంగానే మంగళవారం అర్ధరాత్రి బండి సం జయ్‌ను జ్యోతినగర్‌లోని అతని స్వగృహం నుం చి బలవంతంగా అరెస్టు చేసి బొమ్మల రామారం పోలీసుస్టేషన్‌కు తరలించారు.

- గతేడాది జనవరి 2వ తేదీన 317 జీవో అమ లుకు వ్యతిరేకంగా జరిగిన దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఆ క్రమంలో పోలీసులు బీజేపీ కార్యాలయం తలుపులు బద్దలు కొట్టి అరెస్టు చేసిన విషయం సంచలనం రేపింది. తరువాత ఈ విషయంలో పోలీసుల తీరుపై పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీకి బండి ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది.
- ఆ తరువాత నవంబరు 27న భైంసా సభకు అనుమతి లేదంటూ జగిత్యాల సమీపంలో అరెస్టు చేసిన పోలీసులు అదే రోజు రాత్రి ఆయన్ని కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లోని ఆయన నివాసంలో దింపి వెళ్లిపోయారు.
- తాజాగా మరోసారి బండి సంజయ్‌ను అరెస్టు చేస్తున్న క్రమంలోనూ బుధవారం తెల్లవారుజామున తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బండిని అరెస్టు చేయకుండా అనుచరులు తీవ్రంగా ప్రతిఘటించడంతో భారీ తోపులాట జరిగింది. మొత్తానికి బండి సంజయ్‌ను అరెస్టు చేయాల్సి వచ్చిన ప్రతీసారి కరీంనగర్‌లో అర్ధరాత్రి హైడ్రామా నెలకొంటోంది.

డైనమిక్ లీడర్.. రామ్‌లు

- జిల్లా రాజకీయాల్లో విలక్షణమైన వ్యక్తిత్వం
- అనారోగ్యంతో కన్నుమూసిన 'కొమొరెడ్డి'
- శోకసంద్రంలో అభిమానులు
- నాయకుల సంతాపం
- మెట్‌పల్లిలో రేపు అంత్యక్రియలు



రామ్‌లు(ఫైల్)



మెట్‌పల్లి నగరబాటలో దివంగత సీఎం వైఎస్సార్‌తో రామ్‌లు(కుడివైపు)

కోరుట్ల/మెట్‌పల్లి: రాజకీయాల్లో ఆయనది అలుపెర గని పోరాటం.. నమ్మిన సిద్ధాంతం కోసం రాజీపడని మనస్తత్వం.. మాస్, డైనమిక్ లీడర్‌గా ప్రజల్లో గు ర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు(82).. జిల్లా రాజకీయాల్లో విలక్షణమైన వ్యక్తిగా పేరు సంపాదించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బా ధపడుతున్న ఆయన.. బుధవారం హైదరాబాద్ అ పోలో ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. సంపూర్ణ ఆ రోగ్యంగా ఉన్న ఆయన.. రెండేళ్ల క్రితం కరోనా బారి న పడ్డారు. ఆ తర్వాత కోలుకున్నా.. అనారోగ్య సమ స్యలు చుట్టుముట్టాయి. అప్పటినుంచి తరచూ ఆస్ప త్రుల్లో వైద్యచికిత్సలు తీసుకుంటున్నారు. కొద్దిరోజు ల క్రితం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కు టుంబ సభ్యులు హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చే ర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న గుండెపో టుకు గురై తనువు చాలించారు. ఆయన మరణంతో నియోజకవర్గంలో విషాదఛాయలు అలముకున్నా యి. అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయా రు. పార్థివదేహాన్ని మెట్‌పల్లిలోని ఆయన స్వగృహా నికి తీసుకొచ్చారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వ హిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య జ్యోతిదేవి, ముగ్గురు కుమారులు ఉన్నారు.

సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభం..

- మెట్‌పల్లి మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన రామ్‌లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయవిద్య పట్టా పొందారు.
- ఓవైపు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూనే మరోవైపు రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించారు.
- 1968లో వెంకట్రావ్‌పేట సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.
- 1978లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు.
- 1983లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచి రెండోస్థానంలో నిలిచారు.
- 1985 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి చెన్నమనేని విద్యాసాగర్‌రావు చేతిలో కేవలం 372 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి చెందారు.
- 1989, 94, 99 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి పరాజయం పాలయ్యారు.
- 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్ లభించకపోవడంతో జనతా పార్టీ నుంచి ఎన్నికల బరిలో నిలిచారు.
- ఆ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుపై విజయం సాధించి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు.
- ఆ సమయంలో ఫ్లోర్‌లీడర్‌గా వ్యవహరించారు.
- 2009లో పోటీకి దూరంగా ఉన్న ఆయన.. 2014లో మరోసారి కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓడిపోయారు.
- 2018లో పోటీకి దూరంగా ఉన్నారు.
- ఎన్నికల్లో అనేకమార్లు పరాజయం చవిచూసి నా.. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ కొమొరెడ్డి రామ్‌లు ఆదర్శంగా నిలిచారు.

సతీమణి జ్యోతికి రాజకీయంగా ప్రోత్సాహం

- కుటుంబంలో రాజకీయంగా తన సతీమణి జ్యోతిదేవిని కూడా కొమొరెడ్డి రామ్‌లు ఎంతో ప్రోత్సహించారు.
- న్యాయ విద్య అభ్యసించిన జ్యోతిని 1998లో మెట్‌పల్లికి జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో నిలిపారు.
- ఆ ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు.
- అంతకుముందు జ్యోతి మెట్‌పల్లి ఎంపీపీగా ప్రజాసేవలో పాలుపంచుకున్నారు.
- కొమొరెడ్డి రామ్‌లు – జ్యోతి దంపతులకు ముగ్గురు కుమారులు.
- తమలాగే వారిని కూడా న్యాయవాదులుగా తీర్చిదిద్దారు.
- పెద్ద కుమారుడు కరంచంద్‌ను తమ రాజకీయ వారసునిగా వచ్చే ఎన్నికల్లో పోటీలో నిలపాలని నిర్ణయించారు.

ప్రత్యర్థులకు హడల్

రాజకీయాల్లో విమర్శలు సహజం. ఒక పార్టీవారిని మరోపార్టీ వారు విమర్శించడం సాధారణం. కానీ, కోరుట్ల నియోజకవర్గంలో ఇందుకు భిన్నమైన పరిస్థితి ఉండడం గమనార్హం. రామ్‌లును విమర్శిం చడానికి ప్రత్యర్థి పార్టీల నాయకులు ఎవరు కూడా సాహసించకపోవడం ఆయన విలక్షణమైన వ్యక్తిత్వా నికి నిదర్శనమనే అభిప్రాయం ఉంది.

రాజీపడని మనస్తత్వంతో నష్టాలు..

నమ్మిన సిద్ధాంతం కోసం ఆయన ఏనాడూ రాజీపడ లేదు. దీంతో రాజకీయంగా చాలా నష్టపోయారనే అభిప్రాయం ఉంది. బీసీ నాయకుడిగా ఆదినుంచీ దొరల పాలనను వ్యతిరేకించే వారు. ఈ నేపథ్యంలో రాజకీయంగా అనేక ఆటుపోట్లు ఎదురైనా వెనుకంజ వేయలేదు. ఇదే ఆయనకు ప్రజల్లో ప్రత్యేకమైన గుర్తింపు తీసుకొచ్చింది.

పలువురి సంతాపం

కొమొరెడ్డి రామ్‌లు మృతికి మాజీ గవర్నర్ చెన్నమ నేని విద్యాసాగర్‌రావు, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పేరు మార్పుతోనే ఎమ్మెల్యేగా విజయం..

కొమిరెడ్డి రాములుగా ఎన్నికల్లో పోటీచేసిన ప్రతీసారి ఆయన పరాజయమే చవి చూశారు. 2004 ఎన్నికలకు ముందు ఆధ్యాత్మికవేత్తల సూచనల మేరకు తన పేరులో మార్పు చేసుకున్నారు. కొమిరెడ్డిగా ఉన్న ఇంటి పేరును కొమొరెడ్డిగా, రాములు పేరును రామ్‌లుగా మార్చుకున్నారు. ఇలా మార్చుకొని ఆ తర్వాత ఎన్నికల్లో పోటీచేసిన ఆయన విజయం సాధించారు. అది కలిసి రావడంతో అప్పటి నుంచి 'కొమొరెడ్డి రామ్‌లు'గానే కొనసాగుతూ వచ్చారు.

జైలు వద్ద కోలాహలం



కరీంనగర్ జైలు వద్ద పోలీసుల బందోబస్తు

కరీంనగర్‌క్రైం: ఎస్సెస్సీ పేపర్ లీకేజీ వ్యవహారం లో బీజేపీ స్టేట్ చీఫ్ సంజయ్‌కు హన్మకొండ మె జిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించగా.. బుధ వారం రాత్రి కరీంనగర్ జైలుకు తరలించారు. రాత్రి 10 గంటలకు సంజయ్‌ను జైలుకు తీసుకు రాగా, ఆయనను కలిసేందుకు కుటుంబసభ్యు లు, అభిమానులు ప్రయత్నించారు. పోలీసులు పెద్ద సంఖ్యలో చేరుకొని జైలు బయటి గేటు దాటకుండా నిలువరించారు. దీంతో రాష్ట్ర ప్రభు త్వానికి వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు భారీ ఎత్తున నినాదాలు చేశారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. అన్ని చౌరస్తాలలో పోలీసులు మోహరించారు. ట్రాఫిక్ మళ్లింపు చేపట్టి జైలు రోడ్లను దిగ్బంధం చేశారు.

హుజూరాబాద్‌లో కార్యకర్తల అరెస్ట్

బండి సంజయ్‌ని వరంగల్ నుంచి కరీంనగర్ వై పు కాన్వాయ్‌లో తీసుకొస్తున్న క్రమంలో హుజూ రాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకు లు అడ్డుకోవడానికి యత్నించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంజయ్ అరెస్టును నిర సిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిదానాలు చేశారు. మానకొండూరులో బీజేపీ నాయకులు భాషబోయిన ప్రదీప్ యాదవ్, కొండ్ర సురేశ్, మార్కొండ రమేశ్, నందగిరి బలరాం పోలీసుల కాన్వాయిని అడ్డుకునే ప్రయత్నం చేశారు.

కరీంనగర్ టు కరీంనగర్..

మంగళవారం రాత్రి హైడ్రామా మధ్య సంజయ్ ను కరీంనగర్‌లో అరెస్ట్ చేసి వివిధ పోలీసు స్టేష న్‌లు తిప్పారు. బుధవారం సాయంత్రం హన్మ కొండ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుచగా, రి మాండ్ మేరకు బుధవారం రాత్రి తిరిగి కరీంనగ ర్ జైలుకు తరలించారు. 24 గంటలు గడవక ముందే కరీంనగర్‌లోనే అరెస్ట్ చేసి కరీంనగర్ జైలులోనే రిమాండ్ చేశారు.

క్లుప్తంగా

7,8,9 తేదీల్లో జాతీయ మహాసభలు



మహాసభలకు తరలివెళ్తున్న జగిత్యాల కార్మిక నేతలు

జగిత్యాలటౌన్: బీఎంఎస్ జాతీయ మహాసభలకు జగిత్యాల కార్మిక సంఘం నేతలు తరలివెళ్లారు. ఈనెల 7,8,9 తేదీల్లో బీహార్ రాష్ట్రం పాట్నాలో జాతీయ మహాసభలు నిర్వహిస్తున్న క్రమంలో జగిత్యాలకు చెందిన తెలంగాణ స్టేట్ బీడీ కార్మిక సంఘం నేతలు బుధవారం తరలివెల్లారు. పాట్నావెళ్లిన వారిలో బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌కుమార్, ప్రధానకార్యదర్శి కిష్టయ్య, జాతీయ కార్యదర్శి రాజిరెడ్డి, కోశాధికారి కొడాల్రెడ్డితో పాటు మహిళా నాయకురాళ్లు ఉన్నారు.

భూమి పేరుతో రూ.10 లక్షలకు టోకరా..

- ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భూమి కొనుగోలుచేసి ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసి రూ.10 లక్షలులకు టోకరా వేసిన ఇద్దరిపై బుధవారం పోలీసులు కేసు నమోదుచేశారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీరామోజీ సుధాకర్ అనే వ్యక్తికి ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో వ్యవసాయ భూమి అమ్ముతామని చెప్పి అతని వద్దనుంచి ఎల్లారెడ్డిపేటకు చెందిన దేశ్‌పాండే అంజనేయులు, ఒగ్గు బాల్‌రాజు అనే ఇద్దరు రూ.35 లక్షలు తీసుకున్నారు. కొంతకాలం గడిచిన తర్వాత భూమి అమ్మకుండా భూమి వివాదంలో ఉందని చెప్పి సుధాకర్‌కు డబ్బులు తిరిగి ఇస్తామని నమ్మబలికారు. సుధాకర్ ఒత్తిడి తేవడంతో రూ.25 లక్షలు ఇచ్చారు. మిగతా రూ.10 లక్షలు అవసరాలకు వాడుకోని ఇవ్వకుండా మోసంచేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో అంజనేయులు, బాల్‌రాజుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత..



పోలీసులు పట్టుకున్న వాహనం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారు మానేరు వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారంరాజన్నపేటకు చెందిన శివరాత్రి నర్సింహులు పికప్ వాహనంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వాహన తనిఖీలు చేపడుతుండగా పికప్ వాహనానికి ఎలాంటి పత్రాలు లేవన్నారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- తగ్గుతున్న భూగర్భ జలాలు
- 5.01 మీటర్లకు పడిపోయిన జలాలు
- ఒక్క నెలలోనే 0.23 మీటర్లకు పడిపోయిన భూగర్భజలం
- నీటిని పొదుపుగా వాడాలని సూచన



వ్యవసాయ బావుల ద్వారా వరి పంటకు నీరు అందిస్తున్న దృశ్యం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో, భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఓవైపు సాగు, మరో వైపు రోజు వారి అవసరాలకు నీటి వినియోగం ఎక్కువ కావడంతో, నీటి మట్టం తగ్గుతోంది. కేవలం ఒక్క నెలలోనే జిల్లాలో నీటి మట్టం 0.23 మీటర్లు పడిపోవడంతో, అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే మే నెలలో నీటిమట్టం మరింత పడిపోతుందోనని ఆందోళన మొదలైంది. అయితే, మార్చినెలలో కురిసిన అకాల వర్షంతో జిల్లాలోని కొడిమ్యాల, జగిత్యాల రూరల్, వెల్గటూర్, ధర్మపురి మండలాల్లో స్వల్పంగా భూగర్భజలాలు పెరిగాయి.

మున్సిపాలిటీల్లో పెరుగుతున్న నీటి వినియోగం..

జిల్లా కేంద్రమైన జగిత్యాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిల్లో నీటి వినియోగం రోజు రోజుకు పెరిగి భూగర్భజలాలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రతీ ఇంటికి బోరుబావులు ఉండడంతో, ఇష్టం వచ్చినట్లు నీటిని వినియోగిస్తున్నారు. దీంతో భూగర్భజలాలు తగ్గుతున్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలో గతనెలలో 7.05 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా, నీటి మట్టం 0.40 మీటర్లకు పడిపోయి, ప్రస్తుతం 7.45 మీటర్లకు చేరింది. కోరుట్ల పట్టణంలో భూగర్భజల నీటిమట్టం 9.49 మీటర్లకు పడిపోయింది. గత ఫిబ్రవరిలో 8.67 మీటర్లు ఉన్న నీటిమట్టం, మార్చిలో 0.82 మీటర్లు పడిపోయి, 9.49 మీటర్లకు చేరింది. మెట్‌పల్లిలో గత నెలలో 5.04 మీటర్ల లోతులో భూగర్భజలం ఉండగా, మార్చి చివరి నాటికి 0.38 మీటర్లు పడిపోయి 5.42 మీటర్లకు చేరింది. అలాగే, రాయికల్ మున్సిపాలిటీలో ఫిబ్రవరి నెలలో 2.36 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా, మార్చి చివరి నాటికి 0.14 మీటర్లు పడిపోయి, ప్రస్తుతం 2.50 మీటర్లకు చేరింది. ధర్మపురి మున్సిపాలిటీలో గత నెలలో 6.27 మీటర్ల లోతులో భూగర్భజలం ఉండగా, ప్రస్తుతం 0.07 మీటర్లు పెరిగి, 6.20 మీటర్లకు చేరింది.

నాన్-ఆయకట్టు ప్రాంతాల్లో పడిపోతున్న నీటి మట్టం..

జిల్లాలో నాన్-ఆయకట్టు ప్రాంతాలుగా ముద్రపడ్డ(సాగు నీరందని) మల్యాల, మెడిపల్లి, కథలాపూర్, కొడిమ్యాల, మెట్‌పల్లి ప్రాంతాల్లో భూగర్భజలాలు మరింతగా పడిపోతున్నాయి. నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో పంటలకు సాగునీరు ఎక్కువగా వినియోగిస్తుండడంతో భూగర్భజలాలు తగ్గుతున్నాయి. ఈ ప్రాంతాల్లో వరికి బదులు ఆరుతడి పంటలైన మొక్కజొన్న, కంది, పెసర వంటి పంటలు వేయాలని సూచిస్తున్నప్పటికీ, రైతులు వరిపంట వైపే మొగ్గుచూపారు. దీంతో, నెలనెలా భూగర్భజల మట్టం తగ్గుతోంది. మల్యాల మండలంలో గత నెలలో 5.65 మీటర్ల లోతులో నీరుండగా, నీటిమట్టం 1.13 మీటర్లు పడిపోయి, ప్రస్తుతం మార్చి చివరి నాటికి 0.93 మీటర్లకు చేరింది. కొడిమ్యాల మండలంలో ఫిబ్రవరి నెలలో 8.41 మీటర్లు ఉండగా మరింతగా 0.17 మీటర్లు పెరిగి, ప్రస్తుతం 8.24 మీటర్లకు చేరింది. కథలాపూర్ మండలంలో 2.15 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం, ప్రస్తుతం 0.21 మీటర్లు పడిపోయి 2.36 మీటర్లుకు చేరింది. మేడిపల్లి మండలంలో 3.59 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం 0.12 మీటర్లు పడిపోయి, ప్రస్తుతం 3.71 మీటర్లకు చేరింది.

ఒక్క నెలలోనే పడిపోయిన 0.23 మీటర్ల నీటి మట్టం...

జిల్లాలో ఒక్క నెలలోనే నీటిమట్టం సగటున 0.23 మీటర్లకు పడిపోయింది. ఫిబ్రవరి నెలలో 4.78 మీటర్ల లోతులో నీరుఉండగా, నవంబర్ నెలా చివరి నాటికి 0.23 మీటర్లు పడిపోయి, ప్రస్తుతం 5.01 మీటర్లకు చేరింది. గతేడాది మార్చి నెలతో పోలిస్తే 0.16 మీటర్లు తగ్గింది. జిల్లాలో మార్చి చివరి నాటికి కథలాపూర్ మండలంలోనే అతితక్కువ లోతు 2.36 మీటర్ల లోతులో నీరుఉండగా, అత్యధికంగా 9.49 మీటర్ల లోతులో కోరుట్ల మండలంలో నీరు ఉండటం గమనార్హం.

మండలాల వారీగా భూగర్భజల నీటి మట్టం(మీటర్లలో...)

మండలం	ఫిబ్రవరి నెలలో	మార్చి నెలలో
బీర్‌పూర్	3.23	3.36
ధర్మపురి	6.27	6.20
గొల్లపల్లి	4.10	4.64
జగిత్యాల రూరల్	2.65	2.51
జగిత్యాల అర్బన్	7.05	7.45
పెగడపల్లి	4.20	3.82
రాయికల్	2.36	2.50
సారంగాపూర్	5.13	5.24
వెల్గటూర్	2.98	2.96
కొడిమ్యాల	8.41	8.24
మల్యాల	5.65	6.58
ఇబ్రహీంపట్నం	2.71	2.94
కోరుట్ల8	67	9.49
మల్లాపూర్	671	7.49
కథలాపూర్	2.15	2.36
మేడిపల్లి	3.59	3.71
మెట్‌పల్లి	5.04	5.42

నీటిని పొదుపుగా వాడాలి



వర్షాలు కురిసినప్పుడు భూగర్భజలం పైస్థాయిలోనే ఉండేది. నీటిని తోడేస్తున్న కొద్ది భూగర్భజలాలు లోతుకు పడిపోతున్నాయి. రానున్న నెలలో మరింతగా భూగర్భజలాల నీటిమట్టం పడిపోనుంది. నాన్ ఆయకట్టు ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో భూగర్భజల మట్టం పడిపోతోంది. పొదుపుగా నీటిని వాడాల్సిన అవసరం ఉంది.

– నర్సింహులు, జిల్లా భూగర్భజల వనరుల శాఖాధికారి, జగిత్యాల

రామ్‌లు మృతికి సంతాపం



బండారు దత్తాత్రేయ

జగిత్యాల: సుప్రీంకోర్టు న్యాయవాది, మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు మృతిపై హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం ప్రకటించారు. ఈమేరకు రామ్‌లు కుమారుడు కరంచంద్‌తో ఫోన్లోమాట్లాడి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రామ్‌లు మెట్‌పల్లి నియోజకవర్గానికి, కరీంనగర్ జిల్లా ప్రజలకు అందించిన సేవలు, తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న మహ్మద్ గులాం

మేడిపెల్లి(వేములవాడ): భీమారం మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన మైనార్టీ నాయకుడు మహ్మద్ గులాం బుధవారం అంజన్న దీక్షాస్వాములకు అన్నదానం చేశారు. గులాంను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, దీక్షాస్వాములు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వీర్నపల్లి: మండలంలోని కంచర్ల గ్రామంలో ఎస్సై నవత ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సీఐ మొగిలి హాజరై మాట్లాడారు. సైబర్‌నేరాలపై ప్రతీఒక్కరికి అవగాహన ఉండాలని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి వివరాలు అడిగితే స్పందించవద్దన్నారు. ఒకవేళ స్పందిస్తే మోసం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రజలు తమ బ్యాంక్ వివరాలు అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. ఓటీపీలు, మెస్సేజ్‌లకు స్పందించవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 నెంబర్‌కు వెంటనే కాల్‌చేయాలన్నారు కార్యక్రమంలో సర్పంచ్‌పిట్టల రజిత, పోలీస్‌సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో పరీక్ష పత్రాల లీకులు

- బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి

కథలాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యంతో రాష్ట్రంలో పరీక్ష పత్రాల లీకులు జరుగుతున్నాయని, అనవసరంగా బీజేపీ నేతలను అరెస్టు చేయడం దారుణమని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి మండిపడ్డారు. కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ముందస్తుగా అరెస్టు చేయడంతో బీజేపీ నాయకులతో కలిసి మాట్లాడారు. పరీక్ష పత్రాలు తయారీ, పరీక్షల నిర్వాహణ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉంటుందనే విషయం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు తెలియదా అని ప్రశ్నించారు. డబ్బులకు కక్కుర్తి పడి పరీక్ష పత్రాలు అమ్ముకునే దుస్థితిలో ఉండడం సిగ్గుచేటన్నారు. పాలించడం చేతకాకపోతే రాజీనామా చేయాలని, అనవసరంగా బీజేపీపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. బీజేపీ నాయకులు మల్యాల మారుతి, మామిడిపెల్లి ప్రవీణ్, ముస్కరి కిశోర్ పాల్గొన్నారు.

రాజకీయాల్లో దమ్మున్న లీడర్ కొమొరెడ్డి రామ్‌లు

- ఆయన అకాల మరణం బాధాకరం
- కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి
- కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన పలువురు ప్రముఖులు



మాట్లాడుతున్న సత్యంరెడ్డి

మల్లాపూర్: రాష్ట్ర రాజకీయాల్లోనే దమ్మున్న లీడర్ మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లుఅని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని ముత్యంపేటలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రాములు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ గుండెపోటుకు గురై మృతి చెందడం బాధాకరమన్నారు. మెట్‌పల్లి నియోజకవర్గ చివరి ఎమ్మెల్యేగా కొమొరెడ్డి రామ్‌లు చేసిన అభివృద్ధి మరువలేనిదన్నారు. పేదల పెన్నిధిగా, కార్యకర్తలు, ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కారించేవారన్నారు. ఆయన అకాల మరణం నియోజకవర్గానికి తీరనిలోటని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అబద్ధాల బీజేపీకి బుద్ధి చెప్పాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు
- కోరుట్లలో పార్టీ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

కోరుట్ల: రాష్ట్రప్రభుత్వం చపట్టిన అభివృద్ధిని చూసి ఓర్వలేక అబద్ధాలు ప్రచారం చేస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలో బుధవారం జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కోరుట్ల నియోజకవర్గంలో రూ.వందల కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు, సీఎం రిలీఫ్‌ఫండ్ అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతిపక్ష పార్టీలు కల్లబొల్లి మాటలు చెబుతున్నాయని విమర్శించారు. పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి గజదొంగ తీరుగా ఉంటుందని ధ్వజమెత్తారు. తానుఎల్లప్పుడూ ప్రజల మధ్యే ఉంటానని, నియోజక అభివృద్ధి తప్ప మరేదీ ముఖ్యం కాదని అన్నారు.

పేపర్‌లీక్‌లో బీజేపి నేతల హస్తం

పదోతరగతి పేపర్‌లీక్ వ్యవహారంలో బీజేపీ నేతల హస్తం ఉందని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆరోపించారు. ఈమేరకు బుధవారం కోరుట్ల క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు బీజేపీ భారీకుట్రచేస్తోందన్నారు. విద్యార్థులు, యువకుల జీవితాలతో ఆడుకుంటున్న బీజేపీకి ప్రజలు రాబోయే రోజుల్లో బుద్ధిచెబుతారన్నారు. కేంద్రప్రభుత్వ అవినీతి, అరాచకాలను ప్రశ్నించే వారిపై ఈడీ, సీబీఐ వంటి సంస్థలను వాడుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జి, రాష్ట్ర పోలీస్ హౌజింగ్‌బోర్డ్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

మతాల మధ్య చిచ్చు..

బీజేపీ నేతలు దేశంలో మతాల మధ్య చిచ్చుపెట్టి వచ్చే ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల అసత్య ప్రచారాలను బీఆర్ఎస్ కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ విద్యార్థులు అధైర్య పడవద్దని, ప్రభుత్వం అన్ని పరీక్షలను సమర్థవంతంగా నిర్వహిస్తుందన్నారు. పార్టీ జిల్లా ఇచార్జి కోలేటి దామోదర్ గుప్తా మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గానికి సంజయ్ కొత్త తరం నాయకుడన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకే..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: రాష్ట్రంలో అన్నివర్గాలు ప్రభుత్వానికి అనుకూలంగా మారుతున్నాయనే ద్వేషంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పథకం ప్రకారమే పేపర్ లీక్ చేయిస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విమర్శించారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. గ్రూప్–1 పరీక్ష పత్రాన్ని లీక్‌చేసిన రాజశేఖర్‌రెడ్డి బీజేపీ ముఖ్య కార్యకర్త అన్నారు. కమలాపూర్‌లో మైనర్ సాయంతో పదోతరగతి పరీక్ష ప్రారంభమైన తర్వాత పేపర్ బయటకు తెప్పించి, సోషల్‌మీడియాలో వైరల్ చేయించారని విమర్శించారు. పేపర్ లీక్‌లో బీజేపీ, అనుబంధ ఉపాధ్యాయ సంఘాల పాత్ర ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్‌గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందలించినా మార్పు రాలేదు



ఆస్పత్రిలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జగిత్యాలక్రైం: భవిష్యత్‌పై ఎంతో ఆశతో ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థిని ప్రేమిస్తున్నానని జులాయిగా తిరిగే ఓ యువకుడు నిత్యం వేధించాడు. దీంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపారు. అయినా, మార్పు రాలేదు. జైలు నుంచి బయటకు వచ్చాక కూడా బాలికను ప్రేమ పేరుతో వేధిస్తూనే ఉన్నాడు. మనస్తాపం చెందిన మ్యాన ప్రియాంక (17) బుధవారం ఆత్మహత్య చేసుకోవడం విషాదం నింపింది. స్థానిక శ్రీరాంనగర్ వీధికి చెందిన మ్యాన రాజశేఖర్–తేజశ్రీ దంపతుల కుమార్తె ప్రియాంక. జగిత్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసింది. ప్రస్తుం ఎంసెట్‌కు సిద్ధమవుతోంది. తండ్రి రాజశేఖర్ మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ప్రియాంకను చేని సంపత్ ఉరఫ్ ఓంకార్ (19) ప్రేమ పేరుతో కొంతకాలంగా వేధిస్తున్నాడు. దీంతో గతంలో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు జైలుకు పంపించారు. ఆ తర్వాత బయటకు వచ్చినా అతడిలో మార్పురాలేదు. తనను ప్రేమించాలంటూ ప్రియాంకను నిత్యం వేధిస్తున్నాడు. మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్య చేసుకుంది. పట్టణ సీఐ కిశోర్, ఎస్సై సంజీవ్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని ప్రియాంక మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు. తండ్రి ఫిర్యాదు మేరకు చేని సంపత్ ఉరఫ్ ఓంకార్‌పై కేసు నమోదు చేశారు.

నువ్వెప్పుడొస్తావు తల్లి..

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రియాంక మృతదేహం వద్ద ఆమె తల్లి తేజశ్రీ, తండ్రి రాజశేఖర్ రోదించడం కలచివేసింది. 'నువ్వు ఎక్కడకు వెళ్లావు తల్లీ.. మళ్లీ ఎప్పుడొస్తావు తల్లీ' అంటూ రోదించడం అక్కడున్నవారిని కదిలిచింది. సమీప బంధువులు కూడా బాలిక మృతదేహాన్ని చూసి రోదించారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సంపాదించి, తమకు వెన్నంటి ఉంటుందని ఆశించిన తల్లిదండ్రులకు శోకమే మిగిలింది.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఇందిరమ్మ కాలనీ గ్రామంలో గురువారం వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇందిరమ్మకాలనీకి చెందిన జక్కని నారాయణ(70) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో గురువారం ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కొడుకు జక్కని రమేశ్, కూతురు భాగ్యలక్ష్మి ఉన్నారు. తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులరహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

జగిత్యాలజోన్: కులరహిత సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జెడ్పీ కార్యాలయంలో బుధవారం జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు గుర్తుచేశారు. జెడ్పీ సూపరింటెండెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

పక్కాగా పాఠశాలల సమాచారం

- యూడైస్ ప్లస్‌లో వివరాలు నమోదు
- క్షేత్రస్థాయిలో జిల్లా అధికారుల పరిశీలన
- నివేదిక ఆధారంగా నిధులు మంజూరు
- జిల్లాలో 1,141 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు



ప్రభుత్వ పాఠశాలలో యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి దేవేందర్

మల్లాపూర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సమగ్ర సమాచారం ఇకనుంచి పక్కాగా లభించనుంది. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు విద్యాశాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో స్థితిగతులు, వాస్తవ పరిస్థితులు, విద్యార్థుల వివరాలు యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్)లో వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఇందులోని వివరాలను జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రాష్ట్ర విద్యాశాఖకు పంపిస్తున్నారు. అక్కడి నుంచి కేంద్రానికి నివేదికలు పంపిస్తే.. విద్యార్థుల సంఖ్యను బట్టి మౌలిక వసతులు కల్పిస్తారు.

నమోదు చేసే అంశాలు..

పాఠశాల పేరు, తరగతులు, తరగతి గదులు, ప్రతీ తరగతిలోని విద్యార్థుల సంఖ్య, విద్యార్థుల నేపథ్యం, బడిలో తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వాటిలో నీటివసతి, పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలు, సంక్రమణ వ్యాధులపై అవగాహన కలిగి ఉన్నారా, హ్యాండ్‌వాష్ ఏర్పాట్లు, తరగతి గదుల స్థితి, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, విద్యార్థుల ఉత్తీర్ణతశాతం, పాఠ్య ప్రణాళిక కార్యక్రమాలు, క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థుల వివరాలు, క్రీడోపాధ్యాయులు, స్కావెంజర్లు తదితర వివరాలు వెబ్‌సైట్‌లో నమోదుచేశారు.

క్షేత్రస్థాయి పర్యవేక్షణ..

- జిల్లాలో ప్రభుత్వ స్కూల్స్, గురుకులాలు, కేజీబీవీలు 838, ప్రైవేటు స్కూల్స్ 303 ఉన్నాయి.
- పాఠశాలల హెచ్‌ఎంలు నమోదుచేసిన వివరాలు కాంప్లెక్స్ స్కూల్‌కు, ఎంఈవో నుంచి డీఈవోకు లాగిన్‌కు చేరతాయి.
- నమోదు చేసిన వివరాలను క్షేత్రస్థాయిలో ఉన్నాయా లేదా అని పరిశీలించేందుకు జిల్లాస్థాయి అధికారిని నియమించారు.
- జిల్లా సెక్టోరియల్ అధికారి దేవేందర్ నేతృత్వంలో క్షేత్రస్థాయిలో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు.
- గత మార్చి 23న క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను ప్రారంభించి 29 వరకు పరిశీలించారు.
- పరిశీలన అనంతరం జిల్లానుంచి రాష్ట్ర విద్యాశాఖకు సమాచారం అందించనున్నారు.

వివరాల ఆధారంగా నిధులు



తప్పిదాలు జరగకుండా ఉండేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. వివరాలు సరిగ్గా ఉన్న పాఠశాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో రాష్ట్ర విద్యాశాఖకు పంపిస్తాం. యూడైస్ ప్లస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ప్రకారమే మౌలిక సదుపాయాలు, స్కూల్ గ్రాంట్స్ మంజూరవుతాయి.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో